కథ

# మరిదిగారి గాజులు

- స్వామి చిత్రానంద

"ఇదిగో! మిమ్మల్నే! ఈ గాజులు చూడండి" అంటూ అరిచింది ఆశాలత- డ్రెస్సింగ్ టేబుల్ ముందు కూర్చుని. తన రెండు చేతులకి ఉన్న గాజు గాజులతో పాటు మరో రెండేసి బంగారు గాజులు రెండు చేతులకీ వేసుకుంది. వాటిని అనేక రకాలుగా కనబడే విధంగా చేతులకు ముఖానికి, కళ్ళకీ, ముక్కుకీ దగ్గరగా పెట్టుకు చూసుకుని, మురిసిపోతోంది. గోడకున్న క్యాలెండరులో ఉన్న సినీతార - ఓ నగల షాపువారి - ప్రకటన కోసం ఇచ్చిన రకరకాల ఫోజుల్లో చూపులు విసురుతోంది. ఆ మాత్రం చూపులు ఆశాలత కూడా విసరగలదు. ఆమెకున్నంత అందం ఈమెకూ ఉంది. ఆ నాడు పెళ్ళి గాకుండా సినిమాల్లోకి వెళితే ఆశాలత కూడా ఓ తార అయ్యేది. ఆమె అదృష్టం అదోలా ఉంది. అందుచేతనే ఓ ఎన్.జీ.వోకు భార్యగా స్థిరపడి పోయింది. ఆ బంగారు- రాళ్ళ గాజుల కోరిక తీరడం లేదు. అంచేత ఇలాంటి ఎరుపు గాజుల్ని అప్పుడప్పుడూ ధరించి, ఆ సినీతారలాగా రకరకాలుగా చేతులు తిప్పుకుంటూ అద్దంలో చూసుకుంటూ తృప్తి పడుతూ ఉంటుంది.

అంతలోనే ఆమె భర్త వచ్చి ఆమె వెనుక నిలబడ్డాడు- అమె ఆనందాన్ని అయన కూడా చూసి ఆనందించాడు.

"బాగుందోయ్- ఎక్కడివీ గాజులు?" అన్నాడు. అవి స్వంతం కావని ఆయనకి తెలుసు.

"మీరు తేలేకపోతే, నేను సంపాదించుకోలే ననుకున్నారా? 'ఒకటో నెంబరు ఆంటీ ఇచ్చింది. ఇవాళంతా పెట్టుకుని రేపు ఇచ్చెయ్యమంది. రేపు లాకర్‌లో పెడతానన్నారట బాబయ్యగారు"

"నిజంగా ఆవిడ నెంబర్‌వన్ ఆంటీ - ఒకటో నెంబరు ఫ్లాట్‌లో ఉంటున్నందుక్కాదు -" అని అభినం దించాడు.

"కెమెరా లేదు గానీ - ఆ సినిమా తార లాగా నీక్కూడా ఫోటోలు తీద్దును. కళ్ళారా చూశాను. ఆ అదృష్టం చాలు-" అన్నాడు.

"ఏమండీ! ఆడిట్లు ఆరంభమైనాయటగా! కాస్త నాలుగు రాళ్ళు రాల్చుకునే సీజనొచ్చిందటగా- అయిదో నెంబరు ఆంటీ చెప్పారు-" అంది ఆశాలత.

"అబ్బబ్బ! ఈ ఫ్లాట్‌లోంచి పోతే తప్ప నాకు మనశ్శాంతి ఉండదు- ఊరికి దూరంగా ఓ చిన్న పూరికొంప దొరికినా చాలు-" అనుకున్నాడు. ఆశాలత అతని దగ్గరకు వచ్చి సముదాయిస్తూ-

"అది కాదండీ- అయిదో నంబరు ఆంటీ చెప్పింది- వాళ్ళ ఆయన ఆఫీసులో కుడిచెయ్యి టేబిల్ మీద పెట్టి, ఎడమ చెయ్యి టేబిల్ క్రింద పెడతాడట- ఆయనేం అడగట్ట! వచ్చినవాళ్ళు వాళ్ళంతట వాళ్ళే ఎడమ చేతుల్లో పెట్టి వాళ్ళ చేతులు దులిపేసుకుని, నమస్కారం పెట్టి వెళ్ళిపోతారట! మీరూ ఆయనలా చెయ్యొచ్చుగా! మీకూ రెండు చేతులున్నాయిగా!" అంది ఆశాలత.

"ఆశా! నాకు అలాంటి సంపాదన అంటే అసహ్యం- ఇహ మీద నువ్వు ఆ మాట ఎత్తితే నేనూరుకోను," అని చరచరా వెళ్ళిపోయాడు.

"ఇదేం మగాడే! ఓ ముద్దూ లేదు- ఓ ముచ్చటా లేదు," అని సణుక్కుంటూ తన చేతులకున్న గాజులను అద్దంలో చూసుకు మురిసి పోతోంది.

"అమ్మా! ఆశా!" అంటూ ఒకటో నెంబరు ఆంటీ వచ్చింది.

"రండి- ఆంటీ!" అంటూ ఆమెను కూర్చోబెట్టింది. ఆశాలత చేతులకున్న తనగాజులను చూసి మురిసి పోతున్నది ఆంటీ-

"నీ చేతులకు ఈ గాజులు బాగా నప్పాయమ్మా మీ వారితో చెప్పి చేయించమను - అయిదో నెంబరావిడ చేయించుకుంటోంది. మీ ఆయన కూడా ఆవిడ మొగుడు పని చేసే ఆఫీసులోనే పని చేస్తాట్ట! ...ఒకటే సెక్షనటగా... మరింకేం?" అని నూరిపోసింది.

"నాకా అదృష్టం లేదు ఆంటీ- ఆయన నా మాట వినరు- నా బ్రతుకింతే. ఇలాగే ఎరువు సొమ్ములు చూసుకు మురిసి పోవాల్సిందే!"

"ఏం చేస్తాంలే! ఆయన ఈ రాత్రి బండికే వూరికి వెళ్తారట- గాజులిస్తే బ్యాంకు లాకర్‌లో పెట్టేస్తానంటు న్నారు-" అంది జాలిగా.

"అయ్యో! ఎంతమాట! తీసుకెళ్ళండి ఆంటీ-" అని ఆ నాలుగు గాజులు తీసి ఆంటీ చేతికి ఇచ్చింది. ఆంటీ వాటిని తన చేతులకి తొడుక్కుని - పమిటతో చేతులు కప్పుకుంది.

"అదేమిటి ఆంటీ! చేతులు అలా దాచుకున్నారు?" అంది.

"అబ్బే! చూస్తున్నాంగా! అందరి కళ్ళూ నా మీదే- నేనిక్కడికి వస్తే చాలు- అంతా గుమ్మాల్లోనే పాతుకు పోయిచూస్తారు - అన్నీ దిష్టికళ్ళే!" అని చేతులు కనబడకుండానే బయటకు వెళ్ళింది.

❥❥❥❥❥❥

"రావయ్యా! రాంపండూ!" అంటూ లోపలకు వస్తున్న మరిదికి స్వాగతం చెప్పింది ఆశాలత- అప్పుడే గదిలోంచి వస్తున్న అమె భర్త-

"బండి లేటనుకుంటాను. నువ్వు మెడ్రాస్ నుంచి రాసిన ఉత్తరం కూడా నిన్ననే అందింది- అంతా కులాసాయేనా?" అన్నాడు.

"ఆ... అంతా కులాసాయే.." అంటూ అతని రెండు చేతుల్లోనూ ఉన్న రెండు సంచుల్ని నేల మీద పెట్టి సోఫాలో కూర్చున్నాడు రాంపండు.

"ఆ సంచులు లోపల గదిలో పెట్టుకో- నే కాఫీ తెస్తాను -" అని లోపలికి వెళ్ళింది ఆశాలత.

రాంపండు ఆ గదిలోకి వెళ్ళి, సామాన్లు మంచం కింద పెట్టి, బాత్‌రూం కెళ్ళి పళ్ళు తోముకుని హాల్లోకి వచ్చాడు. అంతలో ఆశాలత కాఫీ తీసుకువచ్చింది.

"మా చెల్లెలు ఎలా ఉంది? ఆమెను కూడా తీసుకురావల్సింది -" అంది ఆశాలత.

"బాగానే ఉంది.. అన్నట్టు మా అవిడకి గాజులు కొన్నాను- మెడ్రాసులో- చూడు" అని లోపలికి వెళ్ళి, గాజులు తెచ్చి ఆశాలత చేతికి ఇచ్చాడు.

ఆమె వాటిని ఎగాదిగా చూసింది. చేతికి తొడుక్కో వాలా- మానాలా అని సందేహిస్తోంది. అది గమనించిన రాంపండు-

"ఆ గాజులు తొడుక్కు చూడు ఒదినా" అన్నాడు. అనడం తడవుగా ఆమె చేతులకు వేసుకోవడం, లోపలకు వెళ్ళి, అద్దం ముందు నిలబడి, ఆ అద్దాన్ని చూసుకు మురిసిపోవడం క్షణాల మీద జరిగాయి. ఆమె అంతలోనే పరుగు పరుగున బైటికి వచ్చి, గాజులు రాంపండు చేతికిస్తూ-

"పాలు పొంగుతున్నాయి-" అని వంటగది లోకి పరుగెత్తింది.

"స్నానం చెయ్యరా- భోంచేసి కాస్త రెస్ట్ తీసుకో- నేనూ ఆఫీసుకు వెళ్ళాలి. ఆడిట్ ప్రారంభమైంది. కొంచెం హెవీగానే ఉంది వర్కు" అన్నాడు అన్నగారు.

రాంపండు స్నానం చేశాడు.

అంతా భోజనాలు చేశారు. అన్నగారు ఆఫీసుకు వెళ్ళారు. ఆశాలత మాత్రం గదిలో పడుకుంది. రాంపండు హాల్లో సోఫాలో పేపరు చదివినంతసేపు చదివి తానూ సోఫాలో పడుకున్నాడు.

ఆ సాయంత్రం-

ఆశాలత తండ్రిగారు వచ్చారు. ఆయన వచ్చేసరికి, రాంపండు, అన్నగారు ఇంట్లో లేరు.

"రా, నాన్నా" అని ఆయన్ని గదిలోకి తీసుకువెళ్ళింది ఆశాలత.

చీకటి పడింతర్వాత, రాంపండూ, అన్నయ్య బజారు నుంచి వచ్చారు.

కుశల ప్రశ్నలయిన తర్వాత, ఆశాలత లోపల్నుంచి గాజులు తెచ్చి-

"ఏవండీ! మా నాన్నగారు గాజులు తెచ్చారు" అని గాజులు చూపించింది.

"ఎందుకండి ఇప్పుడు? అసలే ఖర్చుల్లో ఉన్నారు మీరు" అని చెబుతూనే మామగారిని అభినందించాడు

అన్నయ్య.

మామగారు మాట్లాడలేదు. అలాగే లేని ధైర్యం తెచ్చుకుని-

"ఈ ఏడాది పంటలు బాగున్నాయి. దానికి తోడు ధర కూడా బాగుంది-" అన్నాడు.

"అంచేత నాకూ, మా చెల్లెలుకూ చెరో జతా ఇవ్వాలనుకున్నారట్ట- మా చెల్లెలు మాత్రం గాజులు వద్దు, రొఖం కావాలి అని అందట! అంచేత నాకు మాత్రం గాజులిచ్చాడు"

అ గాజుల్ని అన్నయ్య రాంపండుని చూడమని ఇచ్చాడు.

రాంపండు వాటిని పరిశీలనగా చూశాడు. ఇవి తాను కొన్న గాజుల్లాగే ఉన్నాయి- వాటి మీద వ్యాపారి ముద్ర కూడా వుంది.

"ఎక్కడ కొన్నారు మామయ్యగారూ?" అన్నాడు.

"ఇంకెక్కడ ఉమ్మిడియారే" అన్నాడు తండ్రి.

కాని, రాంపండు కొన్నది మాత్రం అక్కడ కాదు. వేరే చోట- ఆ పేరు కూడా ఉంది - దాని మీద.

కానీ, ఏమీ-అనలేక ఊరుకున్నాడు.

దాని మీద తర్జన భర్జన జరుగలేదు.

మర్నాడు-

ఉదయం స్నానం చేసింతర్వాత రాంపండు బట్టలు మార్చుకుందుకు సంచీ తెరిచాడు. అందులో అతని గాజులపెట్టె కనిపించలేదు. కంగారుగా వెతికాడు. ఎక్కడా కనబడలేదు.

"ఒదినా! నే కొన్న గాజులు సంచిలో కనబడ్డం లేదు" అన్నాడు.

"సరిగ్గా వెతుకు రాంపండూ! బట్టలన్నీ తీసి చూడు-" అంది ఆశాలత.

"అంతా వెతికాను- కనబడ్డం లేదు ఒదినా"

"కనబడ్డం లేదా?... ఇదంతా ఆ పనిమనిషి పనే! రోజూ, అది గది తుడిచేప్పుడు నేను పక్కనే ఉంటాను. ఇవాళ నాకు వీలుపడలేదు- 'తుడవ్వే' అని వూరుకున్నాను" అంటూ తను ఖంగారుగా వెతికింది.

అంతలోనే పనిమనిషి వచ్చింది.

"ఏంటమ్మగారూ!" అంది.

"అమ్మగారూను- బామ్మగారూను- చెప్పు ఆ గాజులెక్కడ పెట్టావు? తియ్- బైటకు తియ్-" అంటూ మీద మీదకు వచ్చింది.

"గాజులేంటమ్మగారూ! నాకేం తెలవదు" అంది పనిమనిషి.

"నీకేం లోటు చేశానే? రెండు పూటలా భోజనం - పొద్దున్న కాఫీ, సాయింత్రం కాఫీ, నెలనెలా వంద రూపాయల జీతం, ప్రతి పండక్కీ ఓ కొత్తచీరా. ఈ ఫ్లాట్‌లో ఎవరిస్తున్నారే నీకు?" అంటూ ఎడాపెడా కొట్టింది.

అంతలోనే ఆమె భర్త కూడా వచ్చిచ చెయ్యి చేసుకున్నాడు.

తమ్ముడు, తండ్రీ నిర్ఘాంతపోయి చూస్తున్నారు. అయిదో నెంబరు అంటీ కూడా వచ్చింది. ఆవిడకి కోపం కొంచెం ఎక్కువే. ఒళ్ళు కూడా కొంచెం ఎక్కువే. ఆవిడ కూడా నాలుగు తగిలించింది. కొట్టింది చాలక - తిట్లు కూడా మొదలెట్టింది.

"దొంగతనం చేస్తావా? అన్యాయంగా సంపాదించిన సొమ్ము నిలవదే- నాశనం అయిపోతావ్!" అంటూ కొట్టింది.

"ఇహ ఒదలండి-" అంటూ పక్క ఫ్లాట్‌లోంచి ఓ కుర్రాడు వచ్చాడు.

"దాన్ని ఎందుకు కొడతారు?" అంటూ అరిచాడు.

"కొట్టాలా- చంపాలా?" అంది అయిదో నెంబరు ఆంటీ.

"అదే దొంగతనం చేసిందని ఋజువు ఏమిటి?"

"ఆ గదిలోకి అది తప్ప ఎవరూ వెళ్ళలేదు గనక" అంది ఆశాలత.

"మీరూ ఉన్నారుగా!"

"అంటే నా మరిదిగారి గాజులు నేను దొంగతనం చేశానంటారా?"

"మీరు చేశారని కాదమ్మా ఆమె మీద మీకు అనుమానం ఉంటే, మీరు పోలీసు రిపోర్టు ఇవ్వండి.



అంతేగాని - ఓ ఆడమనిషిని ఇలా పట్టుకు బాదకూడదు" అన్నాడు. మెల్లగా పనిమనిషిని లేవదీసి, తన గదిలో ఉన్న ఆయింట్‌మెంట్ రాసి- కిందకు సాగనంపాడు. పనిమనిషి ఏడుస్తూ కిందికి దిగింది.

"అమ్మా నే దొంగతనం చెయ్యలేదమ్మా నన్ను నమ్మండి. నా పిల్ల తోడు. నేను దొంగతనం చేస్తే, నేనూ, నా పిల్లా నాశనమై పోతాం-" అంటూ ఏడుస్తూ మెట్లు దిగింది.

మెట్లకింద ఉన్న పదేళ్ళ కూతురు కూడా తల్లి వెంట- ఆ పక్కనే ఉన్న వాళ్ళ గుడిసెకేసి వెళ్ళింది.

❖❖❖❖❖❖

ఆ రాత్రి-

గుడిసెలోంచి ఏడుపు వినబడుతోంది. పనిమనిషి తాను తిన్న దెబ్బల బాధ భరించలేక పోతోంది. ఆమె కూతురు కూడా తల్లితో పాటు ఏడుస్తోంది. ఇరుగూ పొరుగూ ఆమె మీద జాలిపడి.. బలవంతం చేసి అన్నం తినిపించాలని చూశారు. కాని, ఆమె తినలేదు. ఏదో పిచ్చిపిచ్చిగా వాగుతోంది.

"నేను దొంగని కాదు- దొంగతనం చెయ్యలేదు- నన్ను నమ్మండి. నన్ను కొట్టకండి" అని అరుస్తోందామె.

ఆశాలత ఇంట్లో- అన్నయ్యగారు, రాంపండు మాత్రం హాల్లో ఉన్నారు. ఆ ఏడుపులు వినబడుతూనే ఉన్నాయి. అప్పుడప్పుడూ కిటికీ దగ్గరకు వెళ్ళి గుడిసె వైపు చూసి వస్తున్నాడు రాంపండు. అన్నగారికి మాత్రం పనిమనిషి మీద అనుమానం లేదు.

"ఏమోరా, అది ఏనాడూ ఇలాంటి పని చెయ్యలేదు. ఈ ఫ్లాట్స్‌లోనే నాలుగు ఇళ్ళల్లో పని చేస్తోంది. ఏనాడూ, ఎవరూ దాన్ని అనుమానించలేదు. పాపం, పుణ్యం ఆ భగవంతుడికే తెలియాలి" అన్నారు.

దొంగతనం ఎవరు చేశారో రాంపండుకు తెలిసినా, చెప్పలేని స్థితి. నిజం చెప్పినా- పోయిన గాజులు రావు. పైగా, అన్నదమ్ముల్లో అనవసరమైన మనస్పర్థలు వస్తాయని ఊరుకున్నాడు.

అంతలోనే గుడిసెలోంచి గొల్లుమని గోల వినిపించింది. రాంపండు కిటికీలోంచి కిందకు చూశాడు.

పనిమనిషి గుడిసె దగ్గర జనం గుమిగూడి వున్నారు. అది చచ్చిపోయిందని అర్థమైంది.

"మీ పనిమనిషి చచ్చిపోయింది" అన్నాడు రాంపండు- "చంపేశారు" అనే ధైర్యం లేక.

"ఏవిటీ" అని అనుమానంగా అన్నయ్య కూడా కిటికీ దగ్గరకు వెళ్ళాడు.

ఇంతలో అయిదో నెంబరు అంటీ వచ్చింది.

"అమ్మా! ఆశా! విన్నావా! అది పోయింది- మీ పని మనిషి- మీ గాజులు దొంగిలించలేదూ- అది చచ్చిపోయింది" అని మళ్ళీ వెంటనే వెళ్ళిపోయింది- ఈ వార్త చెప్పడానికి చాలా ఫ్లాట్స్ ఉన్నాయిగా!

ఆశాలత వంటగది గుమ్మంలోంచే విని వెంటనే లోపలకు వెళ్ళింది.

❖❖❖❖❖❖❖

మర్నాడు ఉదయం-

గుడిసెల్లో ఉండే ఓ ముసలతను, ఇద్దరు కుర్రాళ్ళు వచ్చారు అన్నయ్య దగ్గరకు-

"సీత చచ్చిపోయిందండి. దానికెవరున్నారండి. మీలాటోరే గదండి- ఏదో మీకు తోచిందిస్తే- దాన్ని ఇంత బూడిద చేసేస్తాం" అన్నారు.

"మరి దాని కూతుర్ని ఏం చేస్తారు?" అన్నాడు అన్నయ్య.

"మాతో పాటేనండి. మాకున్న దాంట్లోనే అదీ తింటుందండి" అన్నారు.

రాంపండుకు వాళ్ళ ఆత్మీయత చూస్తే ఆశ్చర్యమేసింది. తానుగా ఓ వంద రూపాయలిచ్చాడు.

ఇంతలోనే అయిదో నెంబరు అంటీ వచ్చిందే- కందిపప్పు కావాలంటూ- ఆమెను చూసిన కుర్రాడు

"అమ్మా మీ కోసం మీ ఇంటికెళ్ళామండి- తలుపు తాళమెట్టుందండి" అన్నాడు.

"నేనేం ఇవ్వక్కర్లేదు. అదే నాకివ్వాలి. ఓ నెల జీతం

అడ్వాన్సు తీసుకుంది.'' అంది.

"అయితే మేం వసూలు చేసిందాంట్లోంచి ఇమ్మంటారా?'' అన్నాడు ఇంకో కుర్రాడు.

"ఒద్దులే ఆ డబ్బు నాకెందుకు?'' అని వంటింట్లోకి వెళ్ళి కందిపప్పు తీసుకుని చరచరా వెళ్ళిపోయింది.

అన్నయ్య ఇచ్చింది తీసుకుని వాళ్ళు కూడా వెళ్ళిపోయారు.

రాంపండు గదిలోకి వెళ్ళి, తన సంచీలు తీసుకున్నాడు.

"ఏవిటి! ప్రయాణమే!'' అన్నారు ఆశాలత తండ్రి- చదువుతున్న భగవద్గీత మూసి.

"అవునండి, వెళ్ళాలండీ- బహుశా మళ్ళీ వారం పదిరోజుల్లో వస్తా'' అని సంచీలతో బైటికి వచ్చి-

"వస్తాను అన్నయ్యా- ట్రెయిన్ టైమ్ అయింది'' అని చెప్పి రెండడుగులు వంటగది వైపు వేసి, "వస్తాను- వదినా!'' అన్నాడు. ఆమె బైటకు వచ్చి-

"మళ్ళీ వచ్చేటప్పుడు మా చెల్లెల్ని కూడా తీసుకురావాలి. లేకపోతే నేనూరుకోను-'' అంది.

"అలాగే వదినా- మళ్ళీ రావాల్సి ఉంటుంది'' అని కదిలాడు.

"జాగ్రత్తగా వెళ్ళిరా'' అన్నాడు అన్నయ్య.

* * *

రాంపండు హైదరాబాద్ చేరాడు.

అతని భార్య గాజుల కోసం సంచీలు వెదుక్కుంది. జరిగిందంతా చెప్పాడు. ఆమె నిర్ఘాంతపోయింది.

"ఇలాంటి మనుషులు కూడా ఉంటారా?'' అంది.

"ఉన్నారుగా! మా వదిన ఆశ ఖరీదు ఓ ప్రాణం'' అన్నాడు బాధగా.

"పోనీలెండి - అదే పోయింది. గాజులు మళ్ళీ ఏడాది చేయించుకుందాం. ఈ గాజుల కోసం వాళ్ళని తప్పు పట్టడం, వాళ్ళేమో 'మాకు దొంగతనం అంటగట్టారని' మన బంధువులందరికీ చెప్పడం- ఎందుకులెండి. మంచిపనే చేశారు. వాళ్ళ గుణం తెల్సింతర్వాత- మన జాగ్రత్తలో మనం ఉండాలి'' అంది.

కాలకృత్యాలు తీర్చుకుని రాంపండు ఆఫీసుకెళ్ళాడు.

ఆఫీసులో ఉన్నా కూడా రాంపండు ఏదో పరధ్యానంగా ఉండేవాడు. మనసంతా చచ్చిపోయిన పనిమనిషి మీదనే వుండేది ఇంటికి వచ్చిం తర్వాత పనిమనిషిని తలుచుకోని క్షణం లేదు. ఆ పదేళ్ళ కూతురు బ్రతుకేమవుతుందో అనుకునే వాడు. అతన్ని గమనించిన భార్య-

"ఎందుకండీ పదే పదే అదే ఆలోచిస్తారు?'' అని ఓదార్చేది.

"అది నిజమే అనుకో- 'మనకేం?' అని ఊరుకుంటే, ఇది ఇంకా ఎంతకు దారితీస్తుందో!'' అనేవాడు.

ఓ పదిరోజుల తర్వాత మళ్ళీ క్యాంపుకు వెళ్ళవలసి వచ్చింది.

"మీరు మాత్రం, అన్నయ్యగారింట్లో దిగకండి- ఏ హొటల్లోనో దిగి, కావాలంటే ఏ సాయంత్రమో వెళ్ళి, పలకరించి వచ్చేయండి,'' అని సలహా ఇచ్చిందిభార్య.

క్యాంపులో ఉన్నప్పుడు ఓ సాయంత్రం అన్నయ్యగారింటికి వెళ్ళాడు

"రాత్రికి నీ భోజనం ఇక్కడే'' అని ఆశాలత బలవంతం చేసింది.

మాటల్లో పనిమనిషి ప్రసక్తి వచ్చింది. అది దెయ్యమయిందనీ, అందర్నీ పట్టుకు పీడిస్తోందనీ అన్నయ్య చెప్పాడు.

సోఫాలో కూచున్న రాంపండు ఏదో మామూలుగా మాట్లాడుతూ, మాట్లాడుతూ అరవడం మొదలెట్టాడు.

"ఏవిట్రా ఇది? రాంపండూ! ఏవిటిది?'' అన్నాడు అన్నయ్య.

"నేనెవర్నా? నేనెవరో నీకు తెలియదూ? నా మీద దొంగతనం అంటగట్టారే? నా ప్రాణాలు తీశారే? నా కూతుర్ని అనాథని చేశారే- నేను తెలియదా?'' అని



అరుస్తున్నాడు.

అంతలోనే అయిదో నంబరు ఆంటీ వచ్చింది.

"అదేనండి- పనిమనిషి- మీ మరిదిని కూడా ఆవహించింది-'' అని రాంపండు పక్కన కూచుని-

"ఊరుకోవే సీతా! ఊరుకో- నీ కూతురికేం లోటు రానియ్యం- మేం అంతా ఉన్నాంగా! దాన్ని కన్న కూతురులా చూసుకుంటాం, పెళ్ళి అదీ చేస్తాం'' అంది ఆంటీ.

"నీ మాట నమ్మను. నేను నీ దగ్గర నెలజీతం అడ్వాన్సు తీసుకున్నాని అబద్ధమాడావు. నీ వన్నీ అబద్ధాలే!''

"పోనీ- నా మాట నమ్మవే!'' అంది ఆశాలత.

"నీవీ అబద్ధాలే! నీ మరిదిగారి గాజులు నువ్వు దొంగతనం చేశావు. ఆ దొంగతనం నా మీదకు తోశావు''

"అబ్బే! నేను దొంగతనం చేయలేదు- మా నాన్న ఇచ్చాడు''

"మీ నాన్నకెక్కడివే? ఏనాడూ నీకు నేతచీర కూడా పెట్టనివాడు, బంగారు గాజులిస్తాడా? చెప్పు... చెప్పకపోయావో పీక పిసికేస్తాను-'' అని లేచి మీద మీదకు రాబోయాడు రాంపండు. అన్నయ్య అతణ్ణి బైటకు లాగబోయాడు. ఆయన వల్ల కాలేదు.

"మీ వల్ల కాదు - దెయ్యాలకు రాక్షసబలం ఉంటుంది,'' అంది అయిదో నెంబరు ఆంటీ. రాంపండు ఆశాలత మీదకు వస్తూ-

"చెప్పు - నిజం చెప్పు. లేదా నీ పీక నులిమేస్తా'' అని పీక పట్టుకున్నాడు. గత్యంతరం లేక ఆశాలత నిజం ఒప్పుకుది.

"నిజమేనే- గాజులు దొంగతనం చేశాను. నీకు దొంగతనం అంటగట్టితే- నాకు మచ్చ రాదనుకున్నాను గాని- నువ్వు చచ్చిపోతావనుకోలేదు. నన్ను వదులు'' అని చేతులు జోడించి బతిమాలింది.

"తే- గాజులు తే-'' అని గద్దించాడు.

ఆశాలత గాజులు తీసింది.

అన్నయ్య ఆశ్చర్యపోయాడు.

"ఇయ్.. నీ మరిదికిచ్చెయ్'' అన్నాడు రాంపండు.

ఆ గాజుల్ని రాంపండు జేబులో పెట్టింది.

"మరి, నా కూతురు బతుకు?''

"నేను పెంచుకుంటాను- చదివిస్తాను- పెళ్ళి చేస్తాను. సరేనా?''

"అవును. మేం తప్పకుండా చేస్తాం'' అన్నాడు అన్నయ్య.

"మాట తప్పారో!'' అని బెదిరించాడు రాంపండు.

"లేదు.. లేదు.. మాట తప్పనే తప్పం'' అన్నారు ఆశాలత, భర్తాను.

ఈ లోపులో మిగతా ఫ్లాట్స్‌లో వాళ్ళంతా వచ్చారు. వాళ్ళలో పనిమనిషి కూతురు కూడా ఉంది. దాన్ని రాంపండు పట్టుకుని, ఆశాలతకీ, అన్నయ్యకీ అప్పజెప్పాడు.

"చెప్పండి- దేవుడి ముందర ప్రమాణం చేసి చెప్పండి. ఇది మీ కూతురని చెప్పండి''

"ఇది మా కూతురే-'' అన్నారు ఇద్దరూ ఒక్కసారే.

ఫ్లాట్స్ వాళ్ళందరికీ ఆశ్చర్యం, ఆనందమూను.

రాంపండు శాంతించాడు. అలాగే సోఫాలో ఒదిగిపోయాడు. అంతా ఎవరిదారిన వాళ్ళు వెళ్ళిపోయారు. రాంపండు మరి కాస్సేపటికి తేరుకుని, మామూలు మనిషయ్యాడు. అతనికి దెయ్యం సంగతి ఎవరూ చెప్పలేదు. రాత్రి భోంచేసి, ఏమీ ఎరగనట్లు తన హొటల్‌కి వెళ్ళిపోయాడు.

రాంపండు క్యాంపు ముగించుకుని హైద్రాబాద్ చేరగానే, భార్యకు తను చేసిందంతా చెప్పి, గాజులు ఆమె చేతికి తొడిగాడు. ఆనందంగా ఆమె అతణ్ణి కౌగలించుకుంది. ❑